# కావలెను : వధువు

కె. రామలక్ష్మి



**"ఈ ఆడపిల్లలకి కోరికలు ఎక్కువై పోతున్నాయి. అందుకే ఓ పట్టాన సంబంధాలు కుదరడం లేదు!" అని ఓ స్టేట్‌మెంట్ పారేసింది భానుమతి. భానుమతికి ఇద్దరూ కొడుకులే. హాయిగా అమెరికాలో చదువుకుని ఉద్యోగాలు సంపాదించి ఇండియాలో పెళ్లికూతుళ్ల వేట ప్రారంభించిన రకం. అందుకే నాకు నవ్వొచ్చింది.**

"ఎందుకు నవ్వుతావు? నేనన్న దాంట్లో నిజం లేదనా?"

'అబ్బే. అలా ఎందుకనుకుంటానోయ్. ఇద్దరు కొడుకులకి అమ్మాయిలని చూస్తున్న నీ అనుభవాన్ని ఎలా శంకిస్తాను?" అన్నా కాస్త నవ్వేస్తూనే.

"చదువుకున్నారు సరే. మంచి ఉద్యోగాలు వస్తాయి కూడా. అయినా వచ్చిన ప్రతి పెళ్లి కొడుక్కీ వంకలు ఎంచుతారు. వాళ్లకేం కావాలో వాళ్లకే తెలియదు. వాళ్ల తల్లితండ్రుల కంత కంటే తెలియదు కాబోలు!" అంది.

రెండేళ్లుగా చూస్తుంది సంబంధాలు. అందగాళ్లు, మంచి రాబడి ఉన్న వాళ్లు. వాళ్లమ్మ లెక్కన చిన్నమెత్తు దురలవాటు లేనివాళ్లు. మరెందుకు ఏ పిల్లా పెళ్లికి తలవంచడం లేదో నాకు అర్థం కాలేదు. బహాశా భానుమతికి ఉన్నాయేమో - తీరని కోరికలు అన్న అనుమానం రాకపోలేదు నాకు.

నా మనసులో మాట గ్రహించిందో ఏమో "నాకు తెలుసు లక్ష్మీ! నేను కట్నాలకి ఆశపడి సంబంధాలు వదులుకుంటున్నానుకుంటున్నావు కదూ!" అంది కాస్త నిష్ఠూరంగా.

"అబ్బే నీకు డబ్బెందుకు? నువ్వు రిటైరవ్వలేదు. మీ ఆయన రిటైరవ్వలేదు. మీకే మీ రాబడి ఎక్కీ తొక్కీ, ఇంక నీ కొడుకులు అక్కడ డాలర్ల పంటే కదా పండిస్తూ ఉన్నారు?"

"అదిగో అదే వద్దంట. డాలర్లు సంపాదించేసి ఖర్చు చేసేస్తే ఏం లాభం. డాలరంటే ముప్పయి అయిదు. నిలవేస్తే ఎంత లాభం? అప్పుడే చిన్నాడు అక్కడ ఇల్లు కొనుక్కున్నాడు. ఇక్కడ కూడ కొనమంటున్నాడు. డాలర్లు తెచ్చి పోసి కొనడం అవివేకం అంటున్నాను నేను."

"అది నిజమే. ఇక్కడ డబ్బు ఇక్కడ ఖర్చు చేయడం మంచిది. గొడవలుండవు" అన్నా. ఆ క్షణంలో ఈ మధ్య దేశం వచ్చిన ఓ మిత్రుడు జ్ఞాపకం వచ్చాడు. ఫ్లాట్ కొనాలని తెగ తిరిగాడు. అన్నీ సిద్ధం. కాని 'రెండు రోజులాగుదాం. డాలర్ రేటు పెరుగుతుంది' అంటూ కూర్చున్నాడు. తిరిగి అతగాడు వెళ్లే నాటి దాకా అది అంచె లంచెలుగా పెరుగుతూనే ఉంది. "మళ్లీ ఈసారి వచ్చినప్పుడు చూస్తాను. అనవసరంగా డాలర్లు మార్చడం దండగ కదా" అంటూ ప్లేను ఎక్కేశాడు. ఇంటికోసం తిరిగిన బ్రోకరుగారు నన్ను తిట్టి పోశాడు " ఏం గిరాకీ అంట కట్టారండీ" అంటూ.

"ఏమిటీ దీర్ఘంగా ఆలోచిస్తున్నావు? నీ దృష్టిలో ఎవరేనా ఉంటే సజెస్టు చెయ్యరాదూ- పిల్లల కోసం తిరిగి తిరిగి కాళ్లు అరిగిపోతున్నాయి" అంది భానుమతి.

"నీ కొడుకుల వయస్సుకి సరిపడే వాళ్లు నాకు తెలియదోయ్. కాని నేనూ చూస్తున్నాను నా మేనకోడలు కోసం. రాజి నీకు తెలుసుగా?" జ్ఞాపకం చేసుకుంటుందని అన్నాను.

తల అడ్డంగా ఊపి 'రాజి? ఎవరబ్బా?" అంది.

"అదే నువ్వు డాక్టరేటు చేయవద్దని హెచ్చరించావే- అదే రాజేశ్వరి."

"ఏమిటీ ఆ పిల్లకింకా పెళ్లి కాలేదా? ముప్పయి దాటేసి ఉండాలే" ఆశ్చర్యంగా అడిగింది.

డాక్టరేటు చేసింది. చచ్చేన్ని డిప్లమోలు చేసింది. ఉద్యోగం చేస్తూంది. కాని పెళ్లి కొడుకు మాత్రం దొరకడం లేదు. అదేం కర్మో!" అన్నా. నిజంగానే రాజీకి అన్నీ ఉన్నాయి పెళ్లి అదృష్టం పట్టలేదంతే. ఎందుకో తెలియదు. ఆడపిల్లకి ఓ వయస్సు దాటిపోతే సంబంధాలు కుదరనే కుదరవు. సద్దుకు పోడానికి కూడా సిద్ధపడుతూనే ఉంటారు పాపం.

కాని... సర్దుకుపోడానికి కూడా ఓ హద్దు ఉంటుంది కదా.

"చూడలేదా? చేసుకోకా?" కాస్త వెటకారంగా అడిగింది భానుమతి.

"రెండూను." అన్నా కాస్త కోపంగానే.

"అందకత్తెలైనంత మాత్రాన కుదరదు లక్ష్మీ. అబ్బాయి ముందు కొచ్చినప్పుడు కాస్త సర్దుకుపోతే జీవితంలో సెటిలవడం కష్టం కాదు" అంది. ఇదీ ఆవిడ సైన్సు ఈక్వేషన్‌లా చూస్తుంది కాబోలు అనుకున్నా.

"పెళ్లే సర్దుకుపోవడంతో మొదలు పెడితే ఇక జీవిత కాలమంతా చేసేదేమిటి భానుమతీ. మరీ అర్థం లేకుండా మాట్లాడుతున్నావు. నువ్వెందుకకు సర్దుకు పోవు. కోడళ్ల ఎంపికలో?

"అబ్బాయి కర్మేమిటి? వాడు కొండ మీది కోతిని కోరుకున్నా సాధించు కోగలడు అదే అబ్బాయిలకీ అమ్మాయిలకీ తేడా! ఇంత చిన్న విషయం మరిచి పోతే ఎలా?" అంటూ లేచింది భానుమతి కొడుకుల లేటెస్టు ఫొటోలు చేతిలోకి తీసుకుంటూ. 'నేను వస్తానోయ్ లక్ష్మీ. డైవోర్సీ అయినా ఫరవాలేదా రాజీకి. అక్కడ చాలా మంచి పొజిషన్‌లో ఉన్న వాళ్లున్నారు. ఏ ఒకటో అరో పిల్ల లున్నా ఏం పోయింది? ఇంత వయస్సొచ్చేశాకవాళ్లు పిల్లల్ని కంటారా పెడతారా! ఏమంటావు?" అంది. వీధి గుమ్మంలోకి నడుస్తూ.

"ఫరవా లేదులే చూడు. ముప్ఫయి అయిదు దాటి పోతూంది కదా" అన్నాను...

భానుమతి వెళ్లాక చాలాసేపు అలాగే హాల్లో కూర్చుండి పోయాను. ఆడపిల్లలు లేరని కదా ఈ భానుమతి అంత తేలికగా మాట్లాడింది అన్న విషయం నా మనస్సుని కలచి వేసింది.

రాజీ అందంగా ఉంటుంది. తెలివైనది. చదువు వేటలో పడి పెళ్లి వాయిదా పడింది. వాళ్ల నాన్న చూస్తూనే ఉన్నారు. వాళ్లమ్మ ఏడుస్తూనే ఉంది కూతురు జీవితం ఇలా అయిపోయిందే- అని. కాని "ఎప్పుడెదురైతే అప్పుడే దానికిష్టమైన వాడిని చేసుకుంటుందిలే" అని వాళ్లనుకోలేదు. దాన్ని అనుకో నివ్వలేదు. 'చూడనివ్వండి వాళ్ల బాధ్యత అని కదా' అని నవ్వేస్తుం దీ మాట వచ్చినప్పుడల్లా రాజీ. రాజీ నవ్వుతూ కాలం గడుపుతోంది.

భానుమతి వెళ్లాక పదిరోజుల కనుకుంటాను. భానుమతి దగ్గిర నుంచి ఉత్తరం- అందులో అడ్రసు ఉన్నాయి. "ఈయన యు.ఎస్.లో మంచి వ్యాపార వేత్త. విడాకులు తీసుకున్నాడుట. అందమైన చదువుకున్న సౌమ్యమైన వధువు కావాల'ని అక్కడ పేపర్లో వేశాట్ట. మా రవి ఫోనులో చెప్పాడు. వాడు చదువుకునే రోజుల్లో ఆయన



## వేలిముద్రలు

"యువరానర్! ఈ ముద్దాయి ఆ రంగనాధాన్ని పొడిచి చంపాడనడానికి తిరుగులేని సాక్ష్యం ఈ చాకుపై అతని వేలి ముద్రలే."

"అబద్ధం! నేను వేలి ముద్రలు ఎప్పుడో మానివేశాను. సంతకం నేర్చుకున్నాను" చెప్పాడు ఆ అమాయకపు రైతు.

ఐ. బాలసుబ్రహ్మణ్యం (రాజుపాలెం)

ఫాక్టరీలో జాబ్ చేశాట్ట కొన్నాళ్లు. రాజీకి కుదిరితే అదృష్టవంతురాలు" అంటూ రాసింది.

రాజీ నాన్నగారికి చెప్పా. రాజీకి అభ్యంతరం లేకపోతే రాస్తారని. ఆ తరవాత నా గొడవలో నేను ఉండి పోయాను. రెండు మూడు వారాలైంది. ఓరోజు సాయంత్రం వేళ రాజీ వచ్చింది. కాస్త కాఫీ ఇచ్చి "ఏమిటి విశేషం? అమ్మానాన్న బాగున్నారా?' అడిగాను.

"మీరు ఇచ్చిన అడ్రసాయన ఫోను చేశాడు. నాన్న మాట్లాడారు. చాలా జెంటిల్‌మాన్‌లా ధ్వనించారట. ఫొటో వివరాలు పంపారు నాన్న." చెప్పింది రాజీ.

"నువ్వు... నువ్వు మాట్లాడావా?" కుతూహలం అణుచుకోలేక అడిగా.

తలూపింది.

"ఏమన్నాడు?"


'నేను నచ్చానట. నా క్వాలిఫికేషన్లు నచ్చాయిట. 'నువ్వు ఇంకోళ్ల దగ్గిర పని చేయక్కరలేదు. నా ఫాక్టరీ పి.ఆర్.ఓ. పని చేస్తే చాలు అన్నారు. అదీ యిదీ చాలాసేపు మాట్లాడారు. మీరు విడాకులు ఎందుకు తీసుకున్నారో అడగవచ్చా-" అని అడిగా. మనం కలుసుకున్నప్పుడు చెప్తాగా అన్నీ. నే నీ నెలాఖరుకి వస్తా. అన్నీ ముఖాముఖీ మాట్లాడుకొని నిర్ణయించు కోవచ్చు అన్నారు. ఫరవాలేదాంటీ చాలా మర్యాదగా మాట్లాడారు" అంది.


"రాజీ! బాగా ఆలోచించుకుని తరవాత చూడడం బెటర్. తొందర పడకు" అన్నా కాస్త హెచ్చరికగా.

"తినబోతూ రుచులెందుకు? చూస్తానుగా. వివరంగా మీకు చెప్తాను. నేను పనిమీద ఊరుకి వెడుతున్నా మళ్లీ అతన్ని చూశాక కలుస్తా." అంటూ భుజాన బాగ్ వేసుకుంటూ లేచింది.

రాజీ వయసు ఆమె ముఖంలోగాని, ధోరణిలో గాని అస్సలు కనిపించదు. చక్కగా టీనేజర్‌లాగా చలాకీగా ఉంటుంది. నాకు పిల్లలు లేని లోటు ఇలాంటి సందర్భాలలో ఓ వరంగానూ, ఓ శాపంగానూ తోస్తూ ఉంటుంది. వరం ఈ బాధలు తప్పినందుకు. శాపం నిజంగా ముద్దూ ముచ్చటా ఉంటే అవి తీరనందుకు. నే నాయనకి పిల్లని! ఆయన నాకు పిల్లాడు! కాలం హాయిగానే గడిచి పోయిందిప్పటి దాకా.

రెండు వారాలు దాటి పోయింది. రాజీ వాళ్లింటి నుంచి ఏ వార్తా రాక పోవడం - సస్పెన్సు భరించలేకుండా ఉన్నా. రాజీ వచ్చి అన్నీ వివరంగా చెప్తుంది తప్పకుండా. 'ఎందుకో నాకింత తొందరా' అంటూ నా మనసుని నేనే తిట్టుకున్నా.






చాలా లైట్ హార్టెడ్‌గా నవ్వుతూ రాజీ ఓ రోజు రానే వచ్చింది. ఆగలేక "కాయా? పండా?" అడిగాను. నవ్వి "ఎవరికి ఆంటీ?" అంది సోఫాలో కూలబడుతూ.

"చంపకు రాజీ! సస్పెన్సు భరించలేక - నేనే ఫోను చేద్దాం అనుకొంటున్నా" పక్కనే కూలబడుతూ.

రాజీ క్షణం మౌనంగా ఊరుకుంది. మనసు కూడదీసుకుందో, ఊహలు కూడ దీసుకుందో - మరి.

"అతను వచ్చాడు ఆంటీ. కలిశాను. మాట్లాడాను." చాలా నెమ్మదిగా అంది రాజీ.

"ఏమిటీ కాస్తైనా ఉత్సాహంగా లేవు?"

"దేనికి ఉత్సాహం? అమెరికా వాడిని చూసినందుకా? ఆంటీ! మీరంతా ఒకటే! ఆడపిల్లకి పెళ్లి చేసి తీరాలనే అనుకుంటారు... అందుకే నాలాంటి వాళ్లకీ అవమానాలు పరాభవాలూ...' కాస్సేపాగి నవ్వేస్తూ.

"ఓ.కె. మొదట్నుంచీ చెప్పేస్తా వినండి. డైరెక్టు స్పీచ్‌లో చెప్పనా?" కొంటెగా అడిగింది.

నేనేం అనలేదు. మరీ గట్టి దెబ్బ తగిలినప్పుడే ఆడపిల్లలు దాన్ని దాచుకుందుకిలా అతి తేలికగా మాట్లాడాలని చూస్తారు!

"ఐ లై యు."

"నేను డైవోర్సీ అని తెలుసు కదా? నువ్వడిగావు ఎందుకు విడాకులు పుచ్చుకున్నారని. ఆరుగురు పిల్లల తల్లిని వదిలేయ వలసి వచ్చిందంటే ఎంత బలమైన కారణం ఉండాలి!'

"ఆరుగురా? మీకు పిల్లలున్నారని చెప్పలేదేం?'

"లేరని ఎలా అనుకుంటావనుకున్నా? పిల్లలిష్టం లేదా?"

"అలా అని కాదు. చెప్పి ఉండవలసిందని"

"ఇక్కడే ఇండియాలో ఇద్దరు చదువుకుంటున్నారు. నా కూతురికి కూడా డైవోర్స్ అయిపోయింది. ప్రస్తుతం నా దగ్గరే ఉంది"

"మైగాడ్. ఇదంతా ఎందుకు చెప్పలేదు?"

"తెలియకుండా పోదుగా. అందుకే నాకు పెళ్లంటే భయం. నా మొదటి భార్య డైవోర్స్‌తో దరిదాపు బికారినై పోయాను. మళ్లీ కూడదీసుకుని నిలబడ్డాను. అందుకే."

"ఐ.సీ. మీరిప్పుడు చేసుకోబోయే ఆవిడలో దేనికి ఎదురు చూస్తున్నారు?"

"పెళ్లిలాంటి ఉచ్చు వద్దు. కాంట్రాక్ట్. అంతే. నాలుగేళ్లు చూద్దాం. కుదరదూ. విడిపోదాం?"

"అప్పుడు?"

"నా దగ్గిర నుంచి డాలరు అక్కర లేదని రాసివ్వాలి."



**ఒట్టు**

"నేనెంత చెప్పినా నమ్మనేం. నేను చెప్పేది నిజం. అబద్ధం చెబితే నా ప్రాణాలుపోతాయి, సరేనా, కాంతం?"
"మీరు కూడా పెళ్లాన్నైన నేను చెప్పినది నమ్మటం లేదు. నేను అబద్ధం చెబితే నా పసుపు కుంకాలు పోతాయి. సరేనా!"
"ఆఁ ?!!"

వి.వి.సీతారామ్‌దాస్ (గుంటూరు)

"నా పని? ఒకవేళ ఆ కాంట్రాక్ట్ నేను సంతకం చేసే ముందు నాకేమిస్తారు?"

"నో.నో. డాలర్ రాదు. నువ్వు ఉద్యోగం చేసుకోవచ్చు."

సిగరెట్టు అంటించాడాంటీ. నేనూ ఇంక లేచాను.

"చూడు మిస్టర్! నీకు తిండి గడవక ఇండియా నుంచి వంట మనిషి కావాలంటే దొరకదని పెళ్లాం పేరిచ్చి తీసుకు పోదామనుకుంటున్నావు. నీ తత్వం బాగా అర్థమైంది. అంతమంది పిల్లల్ని కని నీ భార్య ఎందుకు విడిపోయిందో నా కర్థం అవుతూంది."

"మీకు సెక్సు లోటు రానివ్వను. నా భార్యగా ఆ గౌరవం ఎలాగా ఉంటుంది. మీకు పెళ్లి అవుతుంది. మీ అమ్మానాన్న సంతోషిస్తారు. ఒక్క నిర్ణయం. రెండు పనులు. ఆలోచించి సమాధానం ఇవ్వండి.

'మీకు సమాధానం చెప్పడానికి ఆలోచన అక్కరలేదు. ఈ సారైనా "కావలెను - వంటమనిషి తిండి తినొచ్చు. జీతం ఎదురు చూడకూడదు" అని చిన్న ప్రింటులో వేయించండి కావలెను వధువు అనడం అనవసరం. మీరింక వెళ్లవచ్చు."

"ప్లీజ్. కొంచెం ఆలోచించండి. వ్యవధి తీసుకోండి."

"గెటప్. గెట్ గోయింగ్." అంటూ లేచి నిలబడ్డాను ఆంటీ.

అతడు ఆశగా నాకేసి చూస్తూనే ఉన్నాడు. నేనే వీధి గుమ్మం దగ్గిర కెళ్లి నిలబడ్డా. అతను వెళ్లాక. తలుపులు వేశానాంటీ. ఇంకా చాలా పెర్సనల్ విషయాలు అడిగాడు అవి మీకు చెప్పలేదు. అవి వింటే - నామీద నాకే అసహ్యం వేసిందాంటీ." అంటూ రెండు చేతులలో ముఖం దాచుకుని ఏడవ సాగింది రాజీ.

అంత చలాకీగా ఉండే రాజీని అంతగా గాయపరచిన విషయాలు ఏమిటై ఉంటాయబ్బా అని ఆలోచిస్తూ "ఊరుకో రాజీ. దరిద్రుడు..." అన్నా రాజీ చేయి అందుకుంటూ.

ఓ చేత్తో చిన్న పిల్లలాగా కళ్లు తుడుచుకుంటూ- "సో... రేపటి నుంచీ ఇంకో దరిద్రుడి కోసం వేట. అంతేనా." నవ్వడానికి ప్రయత్నించిన రాజీ పెదిమలు గెడ్డం దుఃఖంతో అదరడం స్పష్టంగా కన్పించింది నాకు..." వాళ్ల పరువు దక్కదని నా ప్రాణాలు తోడితే ఎలా ఆంటీ... నే వస్తా" అంటూ లేచింది రాజీ. ఆమె వెళ్లినవైపే చూస్తూకూర్చున్నా... మళ్లీ ఏం సంబంధం తెస్తుందో ఈ భానుమతి అన్న ఆలోచన రాబోయింది బుర్రలోకి. దాన్నలాగే తొక్కేశాను.